సీతారాం ఏచూరికి ఘన నివాళి

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని టోకూరు పంచాయతీ దొరగుడ గ్రామంలో నిర్వహించిన సిపిఎం మహా సభలో కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూల మాలలు చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, జడ్పీటీసీ సభ్యులు దీసరి గంగరాజు మాట్లాడుతూ, ఇప్పటికే దేవుడు పేరుతో బీజేపీ పార్టీ రాజకీయ లబ్ధి కోసం మతాల్ని రెచ్చగొడుతుందని తెలిపారు. దీనికి టిడిపి, జనసేన పార్టీలు కొమ్ము కాస్తునాయని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన కార్యదర్శిగా గెమ్మెల భీమరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఎం మండల కార్యదర్శి సోమ్మెల నాగులు, సర్పంచ్ కిల్లో మోస్య, నాయకులు గెమ్మెల దేవన్న, భీమరాజు, మల్లన్న, లక్ష్మణరావు పాల్గొన్నారు

నివాళి అర్పిస్తున్న గంగరాజు

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా

పాడేరులో ఆందోళన చేస్తున్న నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి -పాడేరు: కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, డైలీ వేజ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో పాడేరు కలెక్టర్ ఆఫీస్ వద్ద కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. అంతకుముందు ఐటిడిఏ కార్యాలయం నుండి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న వివిధ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, డైలీ వేజ్, క్యాజువల్ కార్మికులు అగ్రిమెంట్, అప్రెంటిస్ పేరుతో వేలాదిమంది పని చేస్తున్నారని తెలిపారు. వీరంతా ఎక్కువ కష్టం తక్కువ జీతం పొందే కార్మికులని పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నారని తెలిపారు. జిల్లాలో ఐటీడీఏ, గిరిజన సంక్షేమ శాఖ, గురుకులాలు, కాఫీ లైజన్ వర్కర్స్, మెడికల్ అండ్ హెల్త్, విద్యా శాఖ, సమగ్ర శిక్ష, విద్యుత్ జిసిసి హాస్పిటల్ తదితర వాటిలో కార్మికులు పని చేస్తున్నారన్నారు. రోజురోజుకీ మార్కెట్లో నిత్యావసర ధరలు పెరుగుతున్నా వేతనాలు పెరగ లేదని, దీంతో కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వీరికి సెలవులు కూడా ఇవ్వరని, కార్మికులు మృతి చెందినా ఎటువంటి నష్టపరిహారం చెల్లించలేదన్నారు., రిటైర్ బెనిఫిట్ స్కీమ్స్, పిఎఫ్ ఈఎస్ఐ వంటి సౌకర్యాలు అమలు చేయలేదని విమర్శించారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేసి, పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా నాయకులు ఎల్.సుందరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మెడికల్ అండ్ హెల్త్ కాంటాక్ట్ ఉద్యోగ సంఘ నాయకులు లక్ష్మణరావు, బాలన్న, ఐటిడిఏ వర్కర్స్ యూనియన్ రాజు, హాస్టల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కొండలరావు, ఐటీడీఏ కాఫీలైజర్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీను, హాస్పటల్ వర్కర్స్, సమగ్ర శిక్ష జేఏసీ కన్వీనర్ జయరాజ్, కేజీబీవీ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శంకర్రావు, పడాల్, పాల్గొన్నారు.

రంపచోడవరం : రాష్ట్రంలో వివిధ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేసి, సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్ ఈఎస్ఐ పెన్షన్ రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని కోరుతూ సిఐటియు రంపచోడవరం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులు సోమవారం పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐటీడీఏ ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి నాయకులు వాలంటీర్లకు రూ.10వేలు గౌరవ వేతనం ఇస్తానని, వారిని కొనసాగిస్తామని హామీ ఇచ్చిందని, ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు కావస్తున్న నేటికీ వాటిని అమలు చేయలేదని పేర్కొన్నారు. రంపచోడవరం, దేవీపట్నం మండలాల్లో వెలుగు వివోఏలకు 17 మందికి 17 నెలల వేతనాలు పెండింగ్లో ఉన్నాయని తక్షణమే పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో

రంపచోడవరంలో ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు

కూడినటువంటి వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్కు యూనియన్ ప్రతినిధి బృందం అందించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ, నాయకులు రామకృష్ణ, రవి, మల్లెరెడ్డి, జానీ, బాబురావు, మహేష్, వెంకట్, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

మోతుగూడెం : చింతూరు మండలం, మోతుగూడెంలో ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్లోని పేని చేస్తునన కాంట్రాక్ట్ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో తమ సమస్యలను పరిష్కరించాలంటూ చీఫ్ ఇంజనీర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, చీఫ్ ఇంజనీర్కు వినతి పత్రం అందించారు. విద్యుత్ సంస్థలో పనిచేసే ప్రతి కార్మికులను పర్మినెంట్ చేయాలని, 2022 పిఆర్సి ప్రకారం వేతనాలు ఏరియర్స్ ఇవ్వాలని, 17 మంది కాంట్రాక్ట్ కార్మికులను పీస్ రేట్ నుండి మ్యాన్ పవర్గా మార్చాలని, కార్మికులందరికీ హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, ఏపీ జెన్కో ఆసుపత్రిలో కార్మికులకు వైద్య సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

పట్టుబడ్డ నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయి, వాహనాలతో పోలీసులు

851 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-కొయ్యూరు

అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం సిడి.పాలెం జంక్షన్ వద్ద 851 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయంగా వచ్చిన సమాచారం మేరకు కొయ్యూరు ఎస్ఐ నాగార్జున ఆధ్వర్యాన పోలీసులు సిడి.పాలెం జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. మధ్యాహ్నం 3 గంటలకు బూదరాళ్ల గ్రామం వైపు నుంచి ఒక ద్విచక్రవాహనం, రెండు కార్లు వస్తున్నాయి. పోలీసులను చూసిన వాహనదారులు వెంటనే వెనక్కి తిప్పి తప్పించుకునేందుకు ప్రయత్నించారు. వెంటనే పోలీసులు వెంబడించారు. పోలీసులు రావడాన్ని గమనించి మోటారు సైకిల్పై ఉన్న ఇద్దరు, ఒక కారులోని ముగ్గురు, మరో కారులో ఉన్న ఇద్దరు పరారయ్యారు. రెండు కార్ల డ్రైవర్లను ఎస్ఐ అదుపులోకి తీసుకున్నారు. అధికారిక మధ్యవర్తుల సమక్షంలో డ్రైవర్ల స్టేట్మెంట్లను తీసుకొని కార్లను తనిఖీ చేశారు. ఒక కారులో 185 గంజాయి ప్యాకెట్లు, మరో కారులో 94 ప్యాకెట్లు లభించాయి. మొత్తం 851 కిలోల గంజాయిని, ఇద్దరు డ్రైవర్లను, ఎపి31 డిబి 1489 ఒక పల్సర్ బైక్, ఎపి07 ఎల్ 4888 ఎక్స్‌వైఎల్ఓ ఒక మహీంద్ర కారు, ఒడి30 సి 3848 కార్లను, ఒక వివో సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పరుస్తామని ఎస్ఐ నాగార్జున తెలిపారు.

జూనియర్ కళాశాలలో హాస్టల్ ఏర్పాటు చేయాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్

మాట్లాడుతున్న అశోక్

ప్రజాశక్తి -అనంతగిరి:కళాశాలలు, ఆశ్రమోన్నత పాఠశాలలో మౌలిక వసతి సౌకర్యాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ విమర్శించారు. సోమవారం స్థానిక జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ బృందం సందర్శించింది ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. కళాశాల వసతి భవనం మరుగుదొడ్లు, వాటర్ వంటి సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని విద్యార్థులు నేతల దృష్టికి తీసుకువెళ్లారు.

అనంతరం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ అశోక్, అల్లూరి జిల్లా కార్యదర్శి పి.జీవన్‌కృష్ణలు మాట్లాడుతూ, ప్రభుత్వ కళాశాలలకు 25 గదులతో కూడిన భవనాలు ప్రభుత్వం ఏర్పాటు చేయవలసి ఉన్నప్పటికీ చాలీసాలని గదులతో విద్యా బోధన కొనసాగుంచడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనంతగిరి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు హాస్టల్ వసతి భవనలు లేక అద్దె చెల్లించుకుంటూ 200 మంది పైగా విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2016 సంవత్సరంలో హాస్టల్ వసతి భవనం ఏర్పాటుకు అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా అధికారులు పనులను మొదలుపెట్టి పునాది దశలో వదిలివేసారన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, తక్షణమే కూటమి ప్రభుత్వం నిధులను మంజూరు చేసి విద్యార్థిని విద్యార్థులకు వేరువేరుగా హాస్టల్ భవనాలు నిర్మించాలని వారు డిమాండ్ చేశారు.కళాశాల చుట్టూ పరహరి గోడ తో పాటు రన్నింగ్ వాటర్ వంటి మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హాస్టల్ సమస్య పరిష్కరించేంత వరకు పోరాటానికి ముందుకు రావాలని విద్యార్థులకు సూచించారు. అరకు డిగ్రీ కళాశాలలో అధ్యాపకులను విద్యార్థులు ఆందోళన చేపట్టగా ప్రభుత్వం స్పందించి నియమించిందని గుర్తు చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అల్లూరు జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యదర్శులు కె, కార్తీక్ శ్రీను, మండల కమిటీ సభ్యులు, ప్రెసిడెంట్ మున్న, తేజ, సెక్రటరీ లు కళ్యాణి, కె.కృపరాజులు ఎన్నికయ్యారు.

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, చిత్రంలో ఐటిడిఏ పిఓ, సబ్ కలెక్టర్

కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన

- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశం

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పైనా, ఇంటర్మీడియట్, ఐటిఐ, పాలిటెక్నిక్ వంటి కోర్సులపైనా పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏటిడబ్ల్యుఒలు, మండలానికి ముగ్గురు చొప్పున ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్లో సోమవారం మార్గదర్శి కెరీర్ గైడెన్స్‌పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. జిల్లాలోని 22 మండలాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలలలో పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి మార్గదర్శి ప్రోగ్రాం ద్వారా అగ్రికల్చరల్, డిప్లమా, ఇంజనీరింగ్, ఫ్యాషన్ టెక్నాలజీ, డిజైనింగ్, ఆర్కిటెక్చర్ ఇంజనీరింగ్, ఇంటీరియర్ డిజైనింగ్, నేషనల్ డిఫెన్స్ అకాడమీ, పైలట్, సైంటిస్ట్, డాక్టర్, న్యూట్రినిస్ట్ డైటి షేషియన్, ఫార్మసిస్ట్, పారామెడికల్ కోర్సులు, ఫిజియోథెరపిస్ట్, నర్సింగ్, అగ్రికల్చర్, చార్టెడ్ అకౌంట్స్, కంపెనీ సెక్రటరీ, కాస్ట్ అండ్ మేనేజ్మెంట్ అకౌంట్స్, ఎంబీఏ, ఎయిర్ హూ స్టాస్, హెూటల్ మేనేజ్మెంట్, హాస్పటల్ మేనేజ్మెంట్, ట్రావెలింగ్ టూరిస్ట్, టీచర్, పోలీస్, లాయర్, జర్నలిస్ట్, లలిత కళలు, సోషల్ వర్క్, హెూమ్ సైన్స్, ఇంటిగ్రేటెడ్ పీజీ, దూరవిద్య, బ్యాంకింగ్, సివిల్ సర్వీసెస్ తదితర కోర్సుల మీద విద్యార్థులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ, రిసోర్స్ పర్సన్స్ రవీంద్ర, అల్లూరయ్య, హనుమంతరావు, డాక్టర్ మంజునా బిబి, ఎటిడబ్ల్యూఓలు, గిరిజన సంక్షేమ శాఖ ఇన్చార్జి డిడి ఎల్ రజిని, క్రాంతి కుమార్, రామ తులసి, మాస్టర్ ట్రైనర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలోని బూసిగూడెం ప్రభుత్వ సంక్షేమ ఆశ్రమ బాలికలు ఉన్నత పాఠశాల విద్యార్థి భానుప్రియ రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బివిఎస్ రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ జిఎస్ఎ గ్రౌండ్స్‌లో జరిగిన అండర్ 17 హ్యాండ్ బాల్ స్కూల్ పోటీల్లో భానుప్రియ ప్రతిభ కనబరిచి గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ మేరకు భానుప్రియను హెచ్ఎం రామారావు, పిడి శ్యాసామిరెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థిని భానుప్రియను అభి నందిస్తున్న ఉపాధ్యాయులు

పరీఓలు చేస్తున్న వైద్య సిబ్బంది

సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు

ప్రజాశక్తి-పాడేరు:మండలంలోని మినుములూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సోమవారం ఏ.పి.ఆర్ స్కూల్ (బాలికలు) తలారిసింగి, పాడేరులో వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థినులకు సికిల్ సెల్ అనీమియా నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి హాజరైన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సి జమాల్ భాష ఈ సందర్భంగా మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్, ఐ.టి.డి.ఏ ప్రాజెక్ట్ అధికారి ఆదేశానుసారం హాస్టల్స్, స్కూల్ లలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థినులను గుర్తించి మాత్రలను అందించడం జరిగిందని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో 85 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని, వీరిలో జ్వర లక్షణాలు గల 9 మందికి రక్త పూతలు చేసి సాధారణ జ్వరాలుగా గుర్తించామన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని వ్యాధులు వ్యాప్తి చెందినప్పుడు వైద్య సిబ్బందికి తెలియజేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏ.పి.ఆర్.స్కూల్ (పాడేరు) ప్రిన్సిపాల్ గణేష్, ఆరోగ్య విస్తరణ అధికారి గుల్లేలి సింహాద్రి, బి.లక్ష్మణ్, ఏ.ఎన్.ఎం కష్ణవేణి, హెల్త్అసిస్టెంట్ నాగరాజు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా యుటిఎఫ్ టీచర్ ఒలింపిక్స్

సంఘం స్వర్ణోత్సవాల సందర్భంగా నిర్వహణ

ప్రజాశక్తి-రంపచోడవరం

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా టీచర్ ఒలింపిక్స్ పేరుతో నిర్వహిస్తున్న వివిధ రకాల ఆటల పోటీలు రంపచోడవరం మండలం ముసిరిమిల్లి ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా యుటిఎఫ్ అల్లూరి జిల్లా అధ్యక్షులు వై.విల్సన్‌బాబు ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు జిల్లా కార్యదర్శి పి.కృష్ణయ్య చేతుల మీదగా పతకావిష్కరణ చేశారు. అనంతరం వ్యక్తిగత విభాగాలలో పోటీలు నిర్వహించారు. షాట్‌పుట్ మహిళా విభాగంలో ఎం.సుజాత టి.రాజేశ్వరి, పురుషుల విభాగంలో కె.ఆదిత్య దొర, కె.నాగరాజు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. చెస్ మహిళా విభాగంలో జె.పార్వతి, కె.కుమారి, పురుషుల విభాగంలో కె.సత్యనారాయణ, బి.ఆనంద్ ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. 100 మీటర్ల పరుగు పందెం మహిళా విభాగంలో టి.రాజేశ్వరి, కె.వెంకటలక్ష్మి, పురుషుల విభాగంలో కె.నాగరాజు, కె.ఆదిత్య దొర ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. క్యారమ్స్ మహిళా విభాగంలో ఎం.ప్రమీల, ఎం.గంగాదేవి, పురుషుల విభాగంలో ఎస్.వెంగళరావు, జి.కుశరాజు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. టెన్నికాయిట్ మహిళా విభాగంలో ఎం.కవిత, ఎం.సుజాత ప్రథమ, ద్వితీయ స్థానాలో నిలిచారు. షటిల్ సింగిల్స్ మహిళా విభాగంలో ఎం.గంగాదేవి ప్రథమస్థానం సాధించారు. షటిల్ సింగిల్స్ పురుషుల విభాగంలో కె.రాంబాబు, ఎస్.సంజీవ్ ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. షటిల్ డబుల్స్ పురుషుల విభాగం కె.రవికుమార్, పి.మురళీకృష్ణ మొదటి స్థానం, కె.శ్రీనివాస్, ఎస్.సంజీవ్ ద్వితీయ స్థానం సాధించారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారు రాష్ట్రస్థాయి పోటీలకు సిద్ధంగా ఉండాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. అలాగే క్రికెట్‌లో మొదటి స్థానం రంపచోడవరం మండలం, రెండవ స్థానం రాజవొమ్మంగి మండలం, వాలీబాల్‌లో మొదటి స్థానం మారేడుమిల్లి మండలం, రెండవ స్థానం చింతూరు మండలం కైవాసం చేసుకున్నాయి. ఈ క్రీడల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు, పీఈటీలకు, పీడీలకు, ముసలిమిల్లి హైస్కూల్ పాఠశాల హెచ్ఎం కెఆర్‌పికి అభినందనలు తెలిపారు.

బహుమతులు అందుకున్న విజేతలు

నినాదాలు చేస్తున్న సిపిఎం నాయకులు

రోడ్డును నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని సొవ్వ పంచాయితీ కమలబంద వయా సాగిరివలస వరకు వెంటనే తారు రోడ్డు మంజూరు చేయాలని సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆ గ్రామంలో సందర్శించిన సిపిఎం నాయకులు కమలబంద రోడ్డును పరిశీలించారు. స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు కావస్తున్నా గిరిజన గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని మండిపడ్డారు. కమల బంద, సాగిరివలస గ్రామంలో సుమారు 200 కుటుంబాలు 800మంది జనాభా ఉన్నారన్నారు. దశాబ్దాల కాలం నుండి రోడ్డు నిర్మాణం చేయాలని ఆ గ్రామస్తులు విన్నవించుకుంటున్నా ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో గర్భిణీ స్త్రీలు, రోగులకు ఆసుపత్రిలో తీసుకుని వెళ్ళాలంటే డోలిమోతలు తప్పడం లేదని చెప్పారు. గత ప్రభుత్వ హయంలో అనేక సార్లు ఎమ్మెల్యే, ఎంపీ, జిల్లా కలెక్టర్, ఐటిడిఏ పీఓ వద్ద మొర పెట్టుకున్నా ఫలితం దక్కలేదని వాపోయారు. సిపిఎం నాయకులు, మాజీ సర్పంచ్ పి.సురేష్ కుమార్, మండల నాయకులు టి.సూర్యనారాయణ, పి సత్యనారాయణ, వార్డు సభ్యులు పి.మత్తు, వి మహేష్, స్థానిక సిపిఎం నాయకులు జయదాస్, నాగరాజు, బాలరాజు, లచ్చన్న పాల్గొన్నారు.

పబ్లిక్ గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ

ప్రజాశక్తి-రంపచోడవరం

స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. ఏజెన్సీ ఏడు మండలాల నుండి వివిధ సమస్యలపై 242 అర్జీలు సమర్పించారు. వీటిని జిల్లా కలెక్టర్ ఎయస్.దినేష్ కుమార్, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి కట్ట.సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ, ఎల్ఎంసి స్పెషల్ కలెక్టర్ సరళ వందనం, ఐటిడిఎ ఏపీఓ డిఎన్‌వి.రమణ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ నేషనల్ హైవే 516ఇ రోడ్డుకి ఇరువైపులా భూములు కోల్పోయిన బాధితులతో సమావేశం ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ఓ జమల్ బాషా, జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, జిల్లా ఫైర్ సర్వీస్ అధికారి లక్ష్మణస్వామి, సబ్ డిఎఫ్ఓ రామారావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నందు, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ మురళి, డ్వామా పిడి శివయ్య, మొబైల్ మెజిస్ట్రేట్ జాన్ రాజ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలపై ఆదివాసీ జెఎసి వినతి

దేవీపట్నం : దేవీపట్నం మండలంలో కొత్తగా అంగన్వాడీ భవనాలు మంజూరు చేయాలని, చిన్నారి గండి గ్రామం వరకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఆదివాసి జేఏసీ నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జెఏసి నాయకులు తెల్లం శేఖర్, యలగాడ నాగేశ్వరరావు, కారం రామన్నదొర, కె.కన్నప్ప దొర, పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పలు సమస్యలపై కలెక్టర్‌కు సిపిఎం వినతి

రంపచోడవరం : ఏజెన్సీలోని పలు సమస్యలపై సిపిఎం నాయకులు సోమవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పోలవరం నిర్వాసితులకు పునరావాసం, రీహబిటేషన్ తక్షణమే పూర్తి చేయాలని, రంపచోడవరం నియోజకవర్గంలోని 11 మండలాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. దేవీపట్నం మండలం గోదావరిలో అక్రమంగా చేపల వేట నిర్వహించి లక్షల రూపాయలు అక్రమాలకు పాల్పడిన వారిపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు కింద నష్టపోయిన స్థానిక గిరిజన నిర్వాసితులకు గోదావరిలో చేపలు పట్టే అవకాశం కల్పించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన్న కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.వాణిశ్రీ, నాయకులు పల్లపు వెంకట్, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సిరిమల్లి రెడ్డి, విద్యాసాగర్, మడకం శంకరమ్మ ఉన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు కిరణ్, వాణిశ్రీ, వెంకట్ తదితరులు

పారిశుధ్యం ప్రతి ఒక్కరి బాధ్యత

- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: స్వచ్ఛత హై సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం అన్ని కార్యాలయాలు, విద్యాసంస్థలు, వసతి గృహాలు, బస్ డిపోలు, ప్రధాన రహదారులు, హైవేలు, పరిసరాలు, ఖాళీ స్థలాలను శ్రమదానంతో బాగు చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. పారిశుధ్య నిర్వహణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. శ్రమదానంకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ఉపాధ్యాయులు వసతి గృహాల గదులను శుభ్రపరచాలని, డిస్ ఇన్ఫెక్షన్ చేయాలని, సూచించారు. ప్రతి గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ప్రతి ఉద్యోగి, అధికారి శ్రమదానంలో భాగస్వామ్యం కావాలని కలెక్టర్ సూచించారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆదాయం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ప్రకృతి వ్యవసాయంతో ఆదాయాన్ని పెంపొందించుకోవచ్చని సెంటర్ ఫర్ పీపుల్స్ ఫారెస్ట్రీ సంస్థ ప్రోగ్రాం అధికారిణి నాగమణి అన్నారు. మండలంలోని గుంటసీస్లు పంచాయతీ కేంద్రంలో ఆదివాసీ జీవనోపాధి, సుస్థిర వ్యవసాయం పద్ధతులపై గిరిజన రైతులకు సెంటర్ ఫర్ పీపుల్స్ ఫారెస్ట్రీ సంస్థ సోమవారం శిక్షణ ఇచ్చారు. ఒకే పంట, వాణిజ్య పంటల సాగులో రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకంతో పెట్టుబడి ఖర్చు చేసిన ఆహార భద్రత లేకుండా పోతుందన్నారు. కూరగాయలు, పప్పుధాన్యాలు, తృణధాన్యాలు, చిరుధాన్యాల పంట సాగుకు ఊతమివ్వాలన్నారు. ఆదివాసీ సంప్రదాయం, అడవి ఆధారిత ఫలాలయంతో పాటు పోడు వ్యవసాయంతో ఆహార పంటలను పండిస్తే ఆదాయం పెంపుకు దోహదపడుతుందని ఆమె సూచించారు. ఆ సంస్థ సమన్వయకర్త గాసినాయుడు, ప్రతినిధులు రమణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అభినందిస్తున్న ఉద్యోగులు

జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిగా రోహిణి

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారిగా రోహిణి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఉద్యోగులందరూ ఆమెను మర్యాదపూర్వకంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు జిల్లా , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు .

వాహనాలను తనిఖీలు చేస్తున్న పోలీసులు

ముమ్మరంగా వాహనాల తనిఖీలు

ప్రజాశక్తి-జి.మాడుగుల

మండల కేంద్రంలో సోమవారం స్థానిక ఎస్సై ఎస్.షణ్ముఖరావు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. వాహన రికార్డులను పరిశీలించారు. హైవే రహదారి నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో వాహనాలు నడిపేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వాహనదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సక్షం సంరక్షణ కేంద్రం ప్రారంభం

మాట్లాడుతున్న గీత

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: సమగ్ర పోషణ సంరక్షణ కేంద్రాలు చిన్నారులలో మానసిక ఎదుగుదలకు దోహదపడుతాయని ఎంపీడీపీ సభ్యురాలు గీత అన్నారు. డుంబ్రిగుడ అంగన్వాడీ కేంద్రంలో సక్షం సమగ్ర సంరక్షణ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులు సంపూర్ణ పోషకాహారం తీసుకోవాలనే ఆకాంక్షతో పని చేస్తున్నాయని చెప్పారు. అనంతరం సీడీపీవో నీలిమ మాట్లాడారు. మండల వ్యాప్తంగా 12కేంద్రాల్లో సక్షం సమగ్ర సంరక్షణ కేంద్రాలను ప్రారంభించడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

చింతపల్లి: సక్షం అంగన్వాడీ కేంద్రాల్లో కార్పొరేటు స్థాయి నర్సరీ విద్యను అందించనున్నట్లు స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో జీ రమణ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని రామాలయం వీధిలో సక్షం అంగన్వాడీ కేంద్రాన్ని పంచాయతీ సర్పంచ్ దురియా పుష్పలత, ఎంపీటీసీ సభ్యురాలు దానరెడ్డి లక్ష్మీతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం చిన్నారులకు పోషకాహారంతో పాటు, నర్సరీ విద్యను అందించాలనే లక్ష్యంతో సక్షం అంగన్వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. కేంద్రాల పరిధి చిన్నారులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆట, పాటలతో నర్సరీ విద్యతోపాటు నాణ్యమైన పోషకాహారం అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో ఎం.రామలక్ష్మి, సూపర్వైజర్లు కె.విజయ కుమారి గౌరా రుస్సీపా, సీహెచ్.సత్యవతి, . గౌరి, అప్పలనర్సమ్మ అంగన్వాడీ కార్యకర్త ఈదల రాజేశ్వరి, అంగన్వాడీ ఆయా, అంగన్వాడీ చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

కష్టబడి పనిచేసిన నేతలకు గుర్తింపు

టిడిపి అరకు నియోజకవర్గ ఇంచార్జ్ దొన్నుదొర

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: పార్టీ కోసం కష్టపడిన పనిచేసిన వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందని టీడీపి అరకు నియోజకవర్గ ఇన్చార్జి సియ్యారి దొన్ను దొర అన్నారు. సోమవారం అరకులోయ మండల కేంద్రంలోని ఏపీ టూరిజం గోష్టిలో అరకు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ క్లస్టర్,యూనిట్, బూత్ ఇంచార్జ్ ల సభ్యత నమోదు శిక్షణ కార్యక్రమం అరకు పార్లమెంటు కో ఆర్డినేటర్ సత్తిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అరకు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ సియ్యారి దొన్నుదొర పాల్గొని మాట్లాడారు. అరకు నియోజకవర్గ పరిధిలో సుమారు 60 వేల సభ్యత నమోదు లక్ష్యంగా పని చేయాలని తెలిపారు. క్లస్టర్,యూనిట్, బూత్ స్థాయి లో మార్పులు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెదబయలు మండల ఎంపీపీ బోండా వరహాలమ్మ, మాజీ సర్పంచ్ పెట్టేలి రాము, అరకువేలి మాజీ వైస్ ఎంపీపీ పొద్దు అమ్మన్న, యువ నాయకులు దురియ నూకరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దొన్ను దొర

తహశీల్దార్‌కు ఘన సన్మానం

తహశీల్దార్‌ను సన్మానిస్తున్న సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-హుకుంపేట: తహసిల్దార్ రాజలక్ష్మి పదవీ విరమణం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ మాట్లాడుతూ, కష్టాన్ని ఇష్టంగా భావించి అంకితభావంతో పని చేసేవారికి ప్రజాదరణ పొందుతారని ఆయన పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులను సమన్వయంతో పని చేసిన స్థానిక తసిల్దార్ రాజ్యలక్ష్మి మంచి గుర్తింపు తెచ్చుకున్నారని ఆయన కొనియాడారు. సోమవారం తహసీలాద్దర్ రాజ్యలక్ష్మి దంపతులను సన్మానించారు. ఆర్డీవో పద్మజ మాట్లాడుతూ, రెవెన్యూ శాఖలో ఎన్నో ఒడిదుడుకులు ఉన్నా వాటిని సమర్థవంతంగా పరిష్కరించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విశాఖ-కిరండూల్ రైళ్లకు అదనపు విస్టాడోమ్ కోచ్

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికుల అదనపు రద్దీని తొలగించడానికి విశాఖపట్నం-కిరండూల్-విశాఖపట్నం రైళ్లకు అదనపు విస్టాడోమ్ కోచ్, 3వ ఎసి ఎకానమీ కోచ్‌లను జత చేస్తున్నట్లు వాల్తేరు డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. 08551 విశాఖపట్నం-కిరండూల్ రైలుకు అక్టోబర్ 3, 5, 7, 9, 11, 13, 15, 17,19, తేదీల్లోనూ, 08552 కిరండూల్-విశాఖపట్నం రైలుకు అక్టోబర్ 4, 6, 8, 10, 12, 14, 16, 18, 20 తేదీల్లో అదనపు విస్టాడోమ్ కోచ్‌లు జతచేయనున్నట్లు పేర్కొన్నారు. 08551 రైలుకు అక్టోబర్ 2, 4, 6, 8, 10, 12, 14, 16, 18, 20 తేదీల్లోను, 08552 రైలుకు అక్టోబర్ 3, 5, 7, 9, 11, 13, 15, 17, 19, 21 తేదీల్లోను అదనంగా 3వ ఏసీ ఎకానమీ కోచ్ జతచేయనున్నట్లు తెలిపారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని అరుకు పంచాయతీ కేంద్రంలో వీధి రోడ్ల నిర్మాణానికతి ఎమ్మెల్యే మత్స్యలింగం సోమవారం శంకుస్థాపన చేశారు. జిల్లా పరిషత్తు నిధులతో సీసీ రోడ్లను ఎంపీపీ ఈశ్వరి, జడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. రూ.20 లక్షల జడ్పీ నిధులతో వీధి రోడ్ల నిర్మాణానికి పూనుకున్నామని చెప్పారు. ఉప ఎంపీపీ లలిత, సర్పంచి శారద, ఎంపీటీసీ సభ్యురాలు వరహాలమ్మ, నాయకులు క్రిష్ణారావు, అశోక్, నర్సింగరావు, రామ్మూర్తి, పీఆర్ ఏఈఈ అజయ్ పాల్గొన్నారు.

ఎస్ఐ గోపాలరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అరకులోయ ఎస్సైగా జి.గోపాలరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మోతుగూడెం పోలీసు స్టేషన్లో ఎస్సైగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎస్సైగా మాట్లాడుతూ. అరకులోయ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.ట్రాఫిక్ సమస్య నివారించడానికి కృషి చేస్తామని తెలిపారు.

'జార్జియన్ జాతీయ విశ్వ విద్యాలయంలో నాణ్యమైన వైద్య విద్య'

మాట్లాడుతున్న రెక్టార్ బుచాన్‌వల్లి

ప్రజాశక్తి- ఎంవిపి కాలని : జార్జియా దేశంలోని ఎస్ఇయు జార్జియన్ జాతీయ విశ్వ విద్యాలయంలో తక్కువ ఖర్చుతోనే నాణ్యమైన వైద్య విద్య అందుబాటులో ఉందని ఆ విశ్వ విద్యాలయ రెక్టార్ డాక్టర్ బుచాస్ వల్లి తెలిపారు. పెదవాల్తేరులోని విశాఖ ఐ హాస్పిటల్ వెనుక జీవి స్క్వేర్‌లోని ఇన్విక్టా కెరీర్ కన్సల్టెన్సీ కార్యాలయం సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భారత్‌లో వైద్య విద్య మధ్య తరగతి ప్రజలకు అత్యంత ఆర్థిక భారంతో కూడుకున్నదని, దీన్ని దృష్టిలో ఉంచుకుని తమ ప్రఖ్యాత ఎస్ఇయు జార్జియన్ విశ్వ విద్యాలయంలో అన్ని వసతులతో వైద్య విద్యను తక్కువ ధరకే అందుబాటులోకి తీసుకు వచ్చామని చెప్పారు. పలు కంప్యూటర్ అండ్ మేనేజ్‌మెంట్ విద్యలు మధ్య తరగతి ప్రజలకు అందుబాటు ఫీజుల్లో అందిస్తున్నామన్నారు. తాము అందిస్తున్న డిగ్రీలను అమెరికా, యూరప్‌ల్లో ఆయా ఉన్నత విద్యా మండలి ఆమోదిస్తున్నాయని తెలిపారు. ఇంటర్ 60 శాతం మార్కులు సాధించి నీట్ పరీక్షలో అర్హత సాధించిన వారు తమ వద్ద వైద్య విద్యలో చేరడానికి అర్హులని పేర్కొన్నారు. ఇంటర్ 80 శాతం మార్కులు దాటిన వారికి స్కాలర్ షిప్ సదుపాయం ఉందన్నారు. తమ వద్ద విద్యార్థులు 56 నెలలు వైద్య విద్యాభ్యాసం, ఆ తరువాత ఇంకో 12 నెలలు సంబంధిత ఆసుపత్రిలో ఇంటర్న్ షిప్ చేయవలసి ఉంటుందన్నారు. మీడియా సమావేశంలో సంస్థ ఎండీ డాక్టర్ చిరాగ్, సంస్థ ప్రతినిధి వివేకానంద మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎస్ఐకు సిపిఎం శుభాకాంక్షలు

ఎస్ఐని అభినందిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి- విఆర్.పురం : విఆర్.పురం నూతన ఎస్ఐ సంతోష్ కుమార్‌ను సిపిఎం నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. లా అండ్ ఆర్డర్ సక్రమంగా నడిపించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ప్రతి విషయంలోనూ తాము అండగా ఉంటామని చెప్పారు. ఎస్ఐని కలిసిన వారిలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చినబాబు, శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్, మండల నాయకులు పంకు సత్తిబాబు, కారం సుందరయ్య, కమ్మచ్చిచ్చు సత్యనారాయణ, సోడి మల్లయ్య, శ్రీరపు తాతబాబు రెడ్డి ఉన్నారు.

ఎస్ఐగా నాగార్జున బాధ్యతల స్వీకరణ

ఎస్ఐనాగార్జున

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు నూతన ఎస్ఐగా వి.నాగార్జున సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నాగార్జున దేవీపట్నం ఎస్ఐగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. కొయ్యూరు ఎస్ఐగా పనిచేస్తున్న రామకృష్ణ బదిలీ అయ్యారు.

వరద బాధితులకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలో వరదలు, వర్షాలతో పనులు లేక చుట్టూ వరద ముంపులో ఉన్న మండల కేంద్రం విఆర్.పురం గ్రామంతో పాటు విఆర్.పురం బీసీ కాలనీ గ్రామానికి చెందిన ప్రజలకు ప్రకృతి విపత్తుల పరిహారం జీవన భృతి రూ.4800 చొప్పున చెల్లించాలని వైస్ ఎంపిపి ముత్యాల భవాని, వడ్డిగూడెం పంచాయితీ సర్పంచ్ సోడి నరసమ్మ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అన్ని గ్రామాల వారికి ఇటీవల జీవన భృతి కింద ప్రతి కుటుంబానికి రూ.4800 చొప్పున ఇచ్చారని, కాని విఆర్ పురం,, విఆర్‌పురం బీసీ కాలనీకి పరిహారం అందలేదని అవేదన వ్యక్తం చేశారు. తక్షణం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి అందరికీ రూ.4800 పరిహారం ఇవ్వాలని కోరారు.

ఒమెగాలో అరుదైన శస్త్రచికిత్స

ప్రజాశక్తి - ఆరిలోవ : 60 ఏళ్లమహిళకు ఆరిలోవ, హెల్త్ సిటీలోని ఒమెగా ఆసుపత్రి అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి ప్రాణాలను కాపాడారు. దీనికి సంబంధించి సోమవారం ఆసుపత్రి సమావేశం మందిరంలో విలేకర్లతో మాట్లాడుతూ, అచ్యుతాపురానికి చెందిన 60 ఏళ్ళ మహిళ ఏడాదిగా తీవ్రకడుపు నొప్పి, ఉబ్బరంతో బాధపడుతుంది. ఒమెగా ఆసుపత్రి వైద్యులను సంప్రదించగా ఆమెకు స్కానింగ్ రక్త పరీక్షలు నిర్వహించారు. కడుపులో గడ్డ ఉన్నట్టు గుర్తించి, అండాశయం కేన్సర్‌గా నిర్ధారించారు.

ట్యూమర్ మొత్తం సుమారు 8 కిలోల బరువు కలిగి ఉండగా, అది మొత్తం కడుపును ఆక్రమించి పేగు భాగాలను, ఎడమ మూత్రనాళంపై ఒత్తిడి తెచ్చి, తీవ్ర కడుపు నొప్పికి కారణమైనట్లు నిర్ధారించారు. ఈ నెల 23న ఎన్‌టిఆర్ సేవా పథకం కింద శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ మురళీధర్, డాక్టర్ శ్రీహర్ష, డాక్టర్ శృతి, ఎనస్థీషియన్స్ డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ అనూషలతో కూడిన వైద్యనిపుణుల బృందం విజయవంతంగా ఆపరేషన్ నిర్వహించి, కణితను తొలగించారు. శస్త్రచికిత్స అనంతరం మహిళ కోలుకొని పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్టు తెలిపారు.

మాదిగమల్లు రహదారి బురదమయం

రాకపోకలకు వాహనదారుల కుస్తీ
అత్యవసర పరిస్థితుల్లోనూ ప్రజల అవస్థలు

బురదలో కూరుకుపోయిన బైక్‌తో అవస్థలు

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం గుమ్మరేవులు నుండి మాదిగమల్లు వెళ్లే రహదారి బురదమయంగా మారింది. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సెప్టెంబర్ 8న అర్ధరాత్రి కురిసిన భారీ వర్షాలకు కొండ చరియలు విరిగి ఈ రహదారిపై మట్టి పేరుకుపోయింది. తాత్కాలిక మరమ్మతుల్లో భాగంగా కోతకు గురైన రహదారిపై జెసిబిలతో మట్టి వేసి సమాంతరంగా చేశారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రహదారి పూర్తిగా బురదమయంగా మారి రాకపోకలకు ఆటంకం ఏర్పడింది.

నిత్యవసర సరుకులు కొనుగోలు చేయాలన్న దారకొండ పీహెచ్సీలో వైద్య సేవలు పొందాలన్నా, ఇతర అవసరాలకు ఈ రహదారిపై ప్రజలు రాకపోకలు సాగిస్తారు. ఈ క్రమంలోనే ఓ యువకుడు ద్విచక్ర వాహనంపై సోమవారం ఉదయం దారకొండ వెళుండగా మాదిగమల్లు వద్ద బురదలో కూరుకుపోయాడు. దీంతో స్థానికుల సహకారం తీసుకొని బైక్‌ను నడిపించుకుంటూ బయటకు తీసుకొచ్చారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిలో ఉన్న బురదను తొలగించి మెటలు వేసి రహదారిపై రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘ నాయకుడు మార్కు రాజు విజ్ఞప్తి చేశారు.

మెరుగైన వైద్య సేవలకు సహకరించాలి

ట్రైసైకిళ్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా వివిధ స్వచ్ఛంద సేవ సంస్థలు ముందుకు రావాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం సమావేశ మందిరంలో విశాఖపట్నం దివిస్ స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత సురేష్ కుమార్ 128 వీల్ చైర్లు ప్రభుత్వ ఆసుపత్రులకు అందించారు. రంపచోడవరం డివిజన్లోని 19 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రెండేసి వీల్ చైర్ చొప్పున మొత్తం 64 వీల్ చైర్లు, స్థానిక ఏరియా ఆసుపత్రికి నాలుగు వీల్ చైర్లు ఏర్పాటు చేసిన దివిస్ స్వచ్ఛంద సేవ సంస్థ సురేష్‌కు అభినందనలు తెలిపారు. అనంతరం వాటిని వైద్యాధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ, డిఎంహెచ్వో జమాల్ బాష, ఏడిఎం అండ్ హెచ్ఓ జి.శిరీష, ఏరియా ఆసుపత్రి ఆర్ఎం వెంకట ఇందిరా, ఏపీఓ డిఎన్వి రమణ, వైద్యాధికారి కెవిన్, నిరంజన్, తాసిల్దార్ కృష్ణ జ్యోతి, డిఎల్‌డిఓ కోటేశ్వరరావు, ఎంపీడిఓ వీర కిషోర్, ఏఎంఓ రాజు, డిసి చంటిబాబు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు చేపట్టాలి

- ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్

ప్రజాశక్తి-చింతూరు : ఏజెన్సీలోని గర్భిణులు, బాలింతలు, పిల్లల్లో రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలని చింతూరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అపూర్వ భరత్ అన్నారు. స్థానిక జూనియర్ కాలేజీలో సోమవారం ప్రాజెక్ట్ స్థాయి పోషణ కార్యక్రమం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి పి.విజయ గౌరీ ఆధ్వర్యంలో జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న పిఒ మాట్లాడుతూ మండలంలోని రక్తహీనతకు గురవుతున్న లబ్ధిదారులను గుర్తించి వారికి తగిన సేవలు అందేవిధంగా కృషి చేయాలన్నారు. లోప పోషణకు గురవుతున్న పిల్లలను న్యూట్రిషన్ రీహాబిలిటేషన్ సెంటర్‌కు రిఫరల్ చేయాలని, వారికి సూపర్వైజరీ ఫీడింగ్ అందించాలని ఆదేశించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి పి.విజయ గౌరి మాట్లాడుతూ హౌజ్ విజిట్స్ క్రమం తప్పకుండా చేసి డిపార్ట్మెంట్‌కు సంబందించిన వివిధ అంశాలు, సేవలపైన లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పథకం కో ఆర్డినేటర్ పవన్, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రాజు, అంగన్వాడి కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చింతూరు ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్

3న ఏచూరి సంస్మరణ సభ

మాట్లాడుతున్న సిపిఎం నేత కిరణ్

ప్రజాశక్తి-కూనవరం : సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ అక్టోబర్ 3న మండలంలోని టేకులబోరు భాస్కర ఫంక్షన్ హాల్లో జరుగుతుందని, ఆ సభకు ప్రజలు తరలిరావాలని సీపీఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సభ ప్రాంగణాన్ని సోమవారం పార్టీ నాయకులతో కలిసి కిరణ్ పరిశీలించారు. అనంతరం సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో కిరణ్ మాట్లాడుతూ ఏచూరి దేశ రాజకీయాలలో తనదైన శైలిలో చెరగని ముద్రవేశారని, ఆయన లేని లోటు తీర్చలేనిదని పేర్కొన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పల్లపు వెంకట్, మేకల నాగేశ్వరరావు, పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, సీనియర్ నాయకులు తలగాని నాగరాజు, షణ్ముకేశ్వరావు, తాళ్లూరి శ్రీనివాసరావు, ఆవుల మురళి, ఉపేంద్ర, కర్నాటి శ్రీనివాసరావు, బాబు బొర్రయ్య, తమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు అఖిలపక్ష కార్మికుల అండ

ప్రజాశక్తి - ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోబోమని అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు అన్నారు. సోమవారం స్టీల్‌ప్లాంట్ బిసి గేటు వద్ద కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి నిరసన చేపట్టారు. కార్మిక సంఘం నేతలు మాట్లాడుతూ స్టీల్‌ప్లాట్‌ను సెయిల్‌లో విలీనం చేస్తానని ఒకవైపు చెబుతూనే మరోవైపు పాస్‌ల రంగులను మారుస్తూ కాంట్రాక్ట్ కార్మికులపై ఉక్కుపాదం మోపే యోచనలో ఉక్కు యాజమాన్యం ఉందన్నారు.నాలుగు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడానికి ఉక్కు యాజమాన్యం రంగం సిద్ధం చేసిందని, దీన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని కార్మిక సంఘ నేతలు హెచ్చరించారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఎంపాయిస్ యూనియన్, సిఐటియు గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరాం, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి ఐఎన్‌టియుసి జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్, స్టీల్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు టిఎన్‌టియుసి నాయకులు బొడ్డు పైడిరాజు, రాజేష్, వంశీ, పులి రమణారెడ్డి పాల్గొన్నారు.

నాగేశ్వరరావు మరణం తీరనిలోటు

ప్రజాశక్తి -గాజువాక: కార్మికులు, ప్రజాసమస్యల పరిష్కారానికి ఉద్యమించిన పి.నాగేశ్వరరావు మరణం తీరనిలోటని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం జగ్గు.నాయుడు అన్నారు. సోమవారం దిబ్బపాలెం ఆర్‌హెచ్ కాలనీలో నాగేశ్వరరావు సంతాప సభ నిర్వహించారు. నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమంలో నాగేశ్వరరావు భాగస్వాములయ్యారన్నారు. ఈ ప్రాంత సమస్యలతోపాటు భవనిర్మాణ కార్మిక సమస్యలపై నిరంతరం పోరాటం చేశారన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు కె.కిరీటం మాట్లాడుతూ, పివి.నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో కొండలపై గుడిసెలు తీసేయాలని పిలుపునిచ్చినప్పుడు ఒక్క గుడిసె కూడా తొలగించకుండా, ఏ ఒక్క పేదవానికి నష్టం జరగకుండా చేపట్టిన పోరాటంలో నాగేశ్వరరావు పాత్ర మరవలేనిదిదన్నారు. సిపిఎం నాయకులు ఎ.లోకేశ్వరరావు మాట్లాడుతూ, సర్వేనెంబర్ 274లో పేదలకు ఇళ్ల స్థలాల పోరాటంలో పాల్గొన్నారన్నారు. సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు అధ్యక్షుతన జరిగిన సంతాపసభలో సిపిఎం నాయకులు, ఎన్. రాజేంద్రప్రసాద్, పివైవి రమణారావు, బంగారునాయుడు, కామేశ్వరి, ఎం.శ్రీదేవి, నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు శారద, కుమారుడు జగన్, కుమార్తెలు పాల్గొన్నారు.